# సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 1 । అక్టోబర్ । 2024






## ముగిసిన అటవీశాఖ క్రీడలు

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులుగా సాగుతున్న అటవీ శాఖ జోనల్ స్థాయి క్రీడలు సోమవారం ముగిశాయి. 8లో



## ఓసీల్లో ఇంకా నీళ్లే..

బొగ్గు ఉత్పత్తిలో ముందుండే మణుగూరులో నెల క్రితం కురిసిన వర్షాలతో ఓసీల్లో భారీగా నీరు చేరి వెనుకబడుతోంది. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

## వాతావరణం

జిల్లాలో మంగళవారం అధిక ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రత పెరుగుతుంది.

## న్యూస్‌రీల్

### రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

**భద్రాచలం:** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళ తాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### 'రాణి రక్షా ప్రశిక్షణ్' కోచ్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తగూడెంటౌన్:** జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాణి లక్ష్మీబాయి రక్షా ప్రశిక్షణ్ పథకం కింద శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌లు దరఖాస్తు చేసుకోవాలని డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షకులు కరాటే బ్లాక్ బెల్ట్ సాధించి ఉండాలని, కనీసం రెండేళ్ల శిక్షణ అనుభవం గల 35 ఏళ్ల లోపు గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లికేషన్లకు విద్యార్హత, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు జతచేసి ఈనెల 3వ తేదీ వరకు తమ కార్యాలయంలో అందించాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేల వేతనం ఇస్తామని, వారానికి మూడు క్లాస్‌లు చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 95054 23226 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### 50 ఏళ్ల వేడుకలకు డీర్ పార్కు ముస్తాబు

- నేడు వాచ్ టవర్‌ను ప్రారంభించనున్న సీసీఎఫ్

**పాల్వంచరూరల్:** చుక్కల దుప్పులకు నిలయమైన కిన్నెరసానిలోని డీర్‌పార్కు ఏర్పాటు చేసి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వేడుకలు నిర్వహించనున్నారు. కిన్నెరసానిలో 1974 సెప్టెంబర్ 29న పార్క్ ప్రారంభం కాగా, మంగళవారం వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఎఫ్‌డీఓ బాబు తెలిపారు. భద్రాద్రి జోన్ సీసీఎఫ్ డి.బీమానాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి జి.కృష్ణగౌడ్ పాల్గొని వాచ్ టవర్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఆతర్వాత యానంబైల్ గుట్టపై ట్రెక్కింగ్ నిర్వహించడమే కాక పాఠశాలల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, పార్కు విశిష్టతపై పోటీలు ఏర్పాటు చేస్తామని వివరించారు.

### జాతీయ సెమినార్‌కు ఆయిల్‌ఫెడ్ అధికారులు



సెమినార్‌లో పాల్గొన్న అధికారులు

**అశ్వారావుపేటరూరల్ :** నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్(ఎన్‌ఎంఈఓ) ఆధ్వర్యంలో అసోంలోని గౌహతిలో ఆయిల్‌పాంపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సెమినార్‌కు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ డివిజనల్ మేనేజర్ ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ సీనియర్ అధికారి రాజశేఖర్ రెడ్డి హాజరయ్యారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి అజిత్ కే సాహు పామాయిల్ తోటల విస్తరణ, సంస్థాగతంగా పటిష్ట నిర్మాణంతోపాటు పలు అంశాలపై ప్రసంగించినట్లు స్థానిక అధికారులు తెలిపారు.

### జీసీసీ ఇన్‌చార్జి డీఎంగా సమ్మయ్య



బాధ్యతలు స్వీకరించిన డీఎం

**భద్రాచలం:** భద్రాచలం ఐటీడీఏ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఇన్‌చార్జి డీఎంగా పాడిపె సమ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డీఎంగా ఉన్న దావిద్ ఉద్యోగ విరమణ చేయగా, ఉన్నతాధికారులను ఆ బాధ్యతలు సమ్మయ్యకు అప్పగించారు. ఈ సందర్భంగా డీఎంకు జీసీసీ మేనేజర్లు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# కార్పొరేషన్ దిశగా..

- ఐదు మండలాల్లోని పలు గ్రామాలను కలిపేలా కసరత్తు
- కనీసం 3 లక్షల జనాభా ఉండేలా చర్యలు
- రెండు బ్లూ ప్రింట్‌లను తయారుచేసిన అధికారులు?

**పాల్వంచ - కొత్తగూడెం మున్సిపాలిటీల విలీనానికి ప్రణాళిక**



పాల్వంచ పట్టణం వ్యూ

**పాల్వంచ:** రాష్ట్రంలోనే అతి పెద్దదైన భద్రాద్రి జిల్లా పారిశ్రామికంగా ఇప్పటికే అభివృద్ధిలో పరుగులు తీస్తోంది. జిల్లాలో ప్రస్తుతం కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ క్రమంలో పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ మేరకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ఈ విషయమై ఇప్పటికే ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. రెండు బ్లూ ప్రింట్లు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తోంది. ఇక ఎన్నికలు లేని కారణంగా పాల్వంచ, మణుగూరు మున్సిపాలిటీల అభివృద్ధి ఎక్కడికక్కడ మందగిస్తోంది. ద్వితీయ శ్రేణి మున్సిపాలిటీగా ఉన్న కొత్తగూడేన్ని పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చేయాలని ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు కృషి చేశారు. ఈ క్రమంలో ప్రస్తుత ఎమ్మెల్యే కూనంనేని.. తన హయాంలో జరిగేలా చూసేందుకు కృషి చేస్తున్నారు. పాల్వంచ - కొత్తగూడెం కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులతో పాటు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరారు.

**విలీనానికి పరిశీలించే గ్రామాలివే..**

కార్పొరేషన్ పరిధిలో పాల్వంచ మండలం బసవతారక కాలనీ, జగన్నాథపురం, కేశవాపురం, లక్ష్మీదేవిపల్లి, నాగారం కాలనీ, రంగాపురం, చుంచుపల్లి మండలం 3 ఇంక్లెయిన్, 4 ఇంక్లెయిన్, అంబేద్కర్ నగర్, బాబు క్యాంప్, ధన్‌బాగ్, చుంచుపల్లి, గౌతంపూర్, బాదావత్ తండా, నందు తండా, పెనగడప, పెనుబల్లి, ప్రశాంతినగర్, రామాంజనేయ కాలనీ, రాంపురం, రుద్రంపూర్, వెంకటేష్ ఖని, వెంకటేశ్వర కాలనీ, విద్యానగర్ కాలనీ, లక్ష్మీదేవిపల్లి మండలం అశోక్‌నగర్, చాతకొండ, హనుమాన్ కాలనీ, లక్ష్మీదేవిపల్లి, లోతువాగు, ప్రశాంత్ నగర్, సాటివారి గూడెం, శేషగిరి నగర్, శ్రీనగర్ కాలనీ, సుజాతనగర్ మండల కేంద్రంతో పాటు 2 ఇంక్లెయిన్, మంగపేట, నాయకులగూడెం గ్రామాలను విలీనం చేసేలా ప్రతిపాదనలు తయారు చేశారు.

**పారిశ్రామికంగా అభివృద్ధి..**

పారిశ్రామికాభివృద్ధిలో జిల్లా ఇప్పటికే ముందంజలో ఉంది. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో సింగరేణి గనులు, పాల్వంచలో కేటీపీఎస్, నవ లిమిటెడ్, ఎన్‌ఎండీసీ, మణుగూరులో సింగరేణితో పాటు బీటీపీఎస్ కర్మాగారం ఉన్నాయి. అశ్వాపురంలో హెవీ వాటర్ ప్లాంట్, సారపాక బీపీఎల్ వంటి పేరుగాంచిన సంస్థలు ఉన్నాయి. ఇక ఐటీ హబ్‌లు, కొత్త ఇండస్ట్రీలు, విమానాశ్రయం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో జంట పట్టణాలను కలిపి కార్పొరేషన్ చేస్తే మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

**తొలగనున్న అడ్డంకులు..**

పాల్వంచ ఏజెన్సీ ప్రాంతమా, నాన్ ఏజెన్సీనా అనేది తేలకపోవడంతో మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించడం లేదు. అధికారుల పాలనలో అభివృద్ధి అంతంతగానే ఉంది. ఈ క్రమంలో రెండు పట్టణాలను కలిపి కార్పొరేషన్ చేయాలనే ఆలోచన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే కార్పొరేషన్‌గా మార్చేందుకు స్థానిక ప్రజల నుంచి ఎలాంటి మద్దతు ఉంటుంది, నైసర్గిక స్వరూపం మార్పులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ఎలా స్పందిస్తారు, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది.

**రెండు మున్సిపాలిటీలు.. 5 మండలాలు**

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలతో పాటు పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం మండలాల్లోని పలు ఆవాస గ్రామాలను సైతం కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావాలని కసరత్తు చేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కొత్తగూడెం జనాభా 79,850, పాల్వంచలో 80,144 మంది ఉండగా ప్రస్తుతం కొత్తగూడెంలో 97 వేలకు పైగా, పాల్వంచలో 89వేల మంది ఉంటారని అంచనా. కార్పొరేషన్ కావాలంటే కనీసం 3 లక్షల జనాభా ఉండేలా కసరత్తు చేస్తున్నారు.

**కార్పొరేషన్‌తోనే అద్భుత ప్రగతి**



కొత్తగూడెం - పాల్వంచ కలిపి కార్పొరేషన్‌గా ఏర్పాటైతే అద్భుతమైన ప్రగతి సాధించే అవకాశం ఉంటుంది. హైదరాబాద్- సికింద్రాబాద్, వరంగల్ - హన్మకొండ తర్వాత రాష్ట్రంలో కొత్తగూడెం - పాల్వంచలే జంట పట్టణాలుగా ఉన్నాయి. ఈ రెండు పట్టణాలను కలిపితే అనేక పరిశ్రమలు వస్తాయి. నియోజకవర్గ కేంద్రం కార్పొరేషన్ అయితే పలు సమస్యలు పరిష్కారం అవుతాయి. ఇందుకు నా వంతుగా కృషి చేస్తున్నా.

– కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యే

## విద్యాలయాల్లో ఔషధ మొక్కలు పెంచాలి

- విద్యార్థులకు మెరుగైన బోధన చేయండి
- ఉపాధ్యాయులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన



జగన్నాథపురం పాఠశాలలో కంప్యూటర్లను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

**పాల్వంచరూరల్/చుంచుపల్లి :** ప్రతి విద్యాలయంలో ఔషధ మొక్కలు పెంచాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని జగన్నాథపురం హైస్కూల్‌లో పెంచుతున్న ఔషధ మొక్కలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో రణపాల, తులసి, తిప్పతీగ, నేల ఉసిరి, అలోవేరా వంటి ఔషధ మొక్కలు నాటాలని సూచించారు. రణపాల ఆకు వారానికి ఒకసారైనా తింటే కిడ్నీ సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. ఆ తర్వాత టీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు అందించిన కంప్యూటర్లను ప్రారంభించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఉంటారని, మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే ఎమ్మెల్యేతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. టీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వరరావు అమెరికాలో ఉంటున్నా పుట్టిన ప్రాంతంపై మమకారంతో విద్యార్థులకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పాల్వంచ డిగ్రీ కళాశాలలో రూ.30 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్, జూనియర్ కళాశాలలో 10, జగన్నాథపురం హైస్కూల్‌లో 6 కంప్యూటర్లు, ల్యాబ్ ఏర్పాటు చేశారని తెలిపారు.

**ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం**

జిల్లాను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడమే అందరి లక్ష్యమని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ముగ్గుల పోటీలను



ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్, డీఆర్డీఓ విద్యాచందన

ఆయన పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ఎకో బ్రిక్స్ తయారు చేయిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన మహిళా శక్తి పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహిస్తుందన్నారు. ముగ్గుల పోటీలకు హాజరైన మహిళలకు కలెక్టర్ జూట్ బ్యాగులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి, పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పొరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, ఏఓ శంకర్, ఎంఈఓ శ్రీరాంమూర్తి, టీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు నవీన్, నరాటి ప్రసాద్, సాబీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం సేకరణకు కార్యాచరణ రూపొందించాలి**

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** వానాకాలం ధాన్యం సేకరణ ప్రక్రియను సమగ్ర ప్రణాళికతో చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలన్నారు. తరుగు పేరుతో రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లను అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబు, డీఎస్‌ఓ రుక్మిణి, డీఎంఓ నరేందర్, వ్యవసాయాధికారి బాబురావు, రవాణా శాఖాధికారి సదానందం పాల్గొన్నారు.

## విచారణలో జాప్యం చేయొద్దు

**పోలీస్ సిబ్బందికి ఎస్పీ ఆదేశం**

**కొత్తగూడెంటౌన్:** ప్రజలు పోలీస్‌స్టేషన్లకు వచ్చి ఫిర్యాదులు ఇస్తే విచారణలో జాప్యం చేయొద్దని ఎస్పీ రోహిత్‌రాజ్ సిబ్బందని ఆదేశించారు. తన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 15 మంది బాధితులు తమ సమస్యలు వివరించారు. అందులో నలుగురు ఆయా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదుల విషయంలో తలెత్తిన సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రోహిత్‌రాజ్ మాట్లాడుతూ.. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన వారిలో ముగ్గురు భూ సమస్యలు, ఇద్దరు చోరీ ఘటనలపై, నలుగురు కుటుంబ సమస్యలు, మిగితా వారు ఇతర సమస్యలపై ఫిర్యాదులు ఇచ్చారని వివరించారు.

**ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలకు సన్మానం..**

ఉద్యోగ విరమణ పొందిన చుంచుపల్లి ఏఎస్సై శ్యాంసుందర్‌రావు, భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్సై



ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సైలు, కుటుంబసభ్యులతో ఎస్పీ రోహిత్‌రాజ్

శ్రీనివాస్‌ను ఎస్పీ రోహిత్‌రాజ్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్‌ను త్వరగా అందేలా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్‌ఐ కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు పాల్గొన్నారు.

## క్రీడలను చేరువ చేయాలి



బహుమతులు అందిస్తున్న పీఓ రాహుల్

**పాల్వంచ:** టెన్నిస్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలను అందరికీ చేరువ చేయాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. స్థానిక టెన్నిస్ కోర్టులో నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నిస్ క్రీడల విజయోత్సవాల సందర్భంగా విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం ప్రాక్టీస్ చేస్తే క్రీడల్లో నైపుణ్యం పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్ రెడ్డి, డాక్టర్ బీఎస్ రావు, బాబురావు, అన్నం వెంకటేశ్వర్లు, దేవేందర్, శ్రీకాంత్, భాస్కర్, కబీర్, రాజ్‌కుమార్, కృష్ణారావు, సతీశ్, వంశీ, మనోజ్, ప్రణయ్ పాల్గొన్నారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**సూపర్‌బజార్(కొత్తగూడెం):** ప్రజావాణిలో అధికారుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

- ఇటీవలి వర్షాలతో పాల్వంచ దమ్మపేట సెంటర్ నుంచి శివనగర్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, సైడ్ కాల్వలు చిన్నవి కావడంతో మురుగు నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి వస్తోందని శివనగర్ వాసులు ఫిర్యాదు చేయగా పాల్వంచ మున్సిపల్ కమిషనర్‌కు ఎండార్స్ చేశారు.
- తాము 30 ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని, దోమలతో విష జ్వరాల బారిన పడుతున్నామని పాల్వంచ మండలం ఉప్పుసాక పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన గిరిజనులు వినతిపత్రం అందించారు. ఇప్పటివరకు పంచాయతీ సిబ్బంది ఇంటిపన్నులు కూడా ఇవ్వడం లేదని పేర్కొనగా.. డీపీఓకు ఎండార్స్ చేశారు. ఇంకా సారపాకకు చెందిన కువారపు మంగ, సారపాక గాంధీనగర్‌కు చెందిన విద్యార్థిని ప్రణవి, కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన కానుకుర్తి ధనలక్ష్మి వ్యక్తిగత సమస్యలపై వినతిపత్రాలు అందించగా ఆయా అధికారులకు పంపించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

# నేటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**కొత్తగూడెంఅర్బన్:** డీఎస్సీ – 2024కు 1:3 నిష్పత్తిలో ఎంపికై నట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ లేదా మెయిల్ కానీ వచ్చిన అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం నుంచి ఈనెల 4 వరకు పరిశీలిస్తామని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. పాతకొత్తగూడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆనందఖని(తెలంగాణ స్కూల్)లో ప్రతీ రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపు షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. పరిశీలనకు వచ్చినప్పుడు వారి సెల్ లేదా మెయిల్‌కు వచ్చిన మెసేజ్ చూపించాల్సి ఉంటుందన్నారు. ఒకటో తరగతి నుంచి స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ, టెట్ అర్హత పత్రాలు ఒరిజినల్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకుని రావాలని వివరించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 477 పోస్టులను ఎంపికైన వారితో భర్తీ చేస్తామని తెలిపారు.


### ప్రతిభ సాధించిన అభ్యర్థులు వీరే..



విష్ణుబాబు గౌడ్

**టేకులపల్లి:** టేకులపల్లికి చెందిన గాడెపల్లి విష్ణుబాబుగౌడ్ 75.33 మార్కులతో ఓపెన్ కేటగిరీలో జిల్లా నాలుగో ర్యాంకు సాధించారు. ఆయన తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతి చెందగా తల్లి ఉపేంద్ర కష్టపడి చదివించింది. 1 నుంచి 10 వరకు టేకులపల్లిలో, ఇంటర్ కొత్తగూడెం, డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, పీజీ ఉస్మానియ యూనివర్సిటీలో పూర్తి చేశారు.

**◆ రెండు ఉద్యోగాలు సాధించిన 'సరికొండ'..**



నాగేశ్వర్‌రావు

మండలంలోని బేతంపూడి గ్రామానికి చెందిన సరికొండ నాగేశ్వరరావు రెండు ఉద్యోగాలు సాధించారు. లాంగ్వేజ్ పండిట్(తెలుగు) ఓపెన్‌లో 9, ఎస్సీ కేటగిరిలో 1, స్కూల్ అసిస్టెంట్(తెలుగు) ఓపెన్‌లో 26, ఎస్సీ కేటగిరిలో 3వ ర్యాంకు సాధించడం విశేషం. 2023లో భార్య సునీత కేన్సర్‌తో మృతి చెందగా తన ఇద్దరు ఆడ పిల్లలతో పాటు తమ్ముడి పిల్లలను సైతం సాకుతూ కష్టపడిన నాగేశ్వరరావు ఏకంగా రెండు ఉద్యోగాలకు అర్హత సాధించారు. తన భార్య ప్రోత్సాహంతోనే పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యాయని, నేడు రెండు ఉద్యోగాలు సాధించిన ఆనందాన్ని ఆమెతో పంచుకోలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**◆ ఎస్‌ఏ తెలుగులో రెండో ర్యాంక్**



లావుద్యా లక్ష్మి

టేకులపల్లి కొత్తతండా(జి) గ్రామానికి చెందిన లావుద్యా లక్ష్మి ఎస్‌ఏ తెలుగులో రెండో ర్యాంకు, ఎస్టీలో 31వ ర్యాంకు సాధించడం విశేషం. ఆమెకు 2017లో భూక్య కుమార్‌తో వివాహమైంది. అదే సంవత్సరం టీఆర్‌టీ రాసినా రాకపోవడంతో పట్టుదలతో చదివి ఇప్పుడు రెండు ఉద్యోగాలకు అర్హత సాధించింది.

**◆ ఫిజికల్ సైన్స్‌లో మొదటి ర్యాంక్**



హరికిరణ్

**దమ్మపేట:** మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన మిద్దె హరికిరణ్ ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో హైదరాబాద్ జిల్లా స్థాయిలో (నాన్ లోకల్ కోటా) మొదటి ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా హరికిరణ్‌ను పలువురు అభినందించారు.

**◆ 'పేట' అభ్యర్థుల ప్రతిభ**



రొయ్యల గణేష్




ఉప్పల శ్రుతి

**అశ్వారావుపేటరూరల్:** డీఎస్సీ ఫలితాల్లో అశ్వారావుపేట మండల అభ్యర్థులు ప్రతిభ చాటారు. వినాయకపురం గ్రామానికి చెందిన రొయ్యల సత్యనారాయణ, కళావతి దంపతుల కుమారుడు గణేష్ జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. ఏడో తరగతి వరకు వినాయకపురం ప్రాథమికోన్నత పాఠశాలలో, 8 నుంచి 10 వరకు కొత్త మామిళ్లవారిగూడెం హైస్కూల్‌లో చదివాడు. అశ్వారావుపేటలో ఇంటర్, సత్తుపల్లిలో డిగ్రీ పూర్తి చేశాడు. అదే గ్రామానికి చెందిన ఉప్పల శ్రుతి బీసీ బీ కేటగిరీలో 22వ ర్యాంక్ సాధించారు.

**◆ అన్నపురెడ్డిపల్లిలో ఇద్దరికి..**




పెద్దిరాజు



కల్లోజి అచ్చయ్య

**అన్నపురెడ్డిపల్లి :** డీఎస్సీ ఫలితాలలో మండలానికి చెందిన ఇద్దరు ఉత్తమ ర్యాంకులు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో తొట్టిపంపు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి పెద్దిరాజు 77.77 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు సాధించారు. గత మార్చిలో విడుదలైన గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లోనూ టీజీటీ, పీజీటీలతో పాటు జేఎల్ పోస్ట్ సాధించి ప్రస్తుతం సత్తుపల్లి గురుకులంలో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన కల్లోజి అచ్చయ్య స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 65.90 మార్కులతో జిల్లా 23వ ర్యాంకు సాధించారు. ఎస్సీ కేటగిరీలో ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు ఆయన సొంతం కానుంది. అచ్చయ్య ప్రస్తుతం 'సాక్షి' అన్నపురెడ్డిపల్లి మండల విలేకరిగా పనిచేస్తున్నారు.

**◆ సత్తాచాటిన గిరిజన యువకుడు**



ఆంజనేయులు

**దుమ్ముగూడెం :** డీఎస్సీ ఫలితాల్లో మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు సొందె ఆంజనేయులు 76.07 మార్కులతో జిల్లా స్థాయిలో జనరల్ కేటగిరీలో రెండో ర్యాంకు సాధించాడు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి, భద్రాచలం ఏజెన్సీ బీఈడీ కాలేజీలో డీఈడీ పూర్తి చేశాడు. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో ఉపాధ్యాయ కొలువు రానుండడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**◆ జనరల్‌లో ఏడో ర్యాంక్..**



అప్పారావు

**పాల్వంచరూరల్ :** పాల్వంచ మండలంలోని కిన్నెరసాని గ్రామానికి చెందిన గోకినపల్లి అప్పారావు జనరల్ కేటగిరీ(సోషల్ విభాగం)లో ఏడో ర్యాంక్ సాధించారు. అప్పారావు యానంబైల్‌లో పదో తరగతి వరకు, పాల్వంచలో ప్రభుత్వ కాలేజీలో ఇంటర్, డిగ్రీ, బీఈడీ నాగార్జునసాగర్‌లో పూర్తి చేశారు.

# ఓసీల్లో ఇంకా నీళ్లే..

**భారీ వర్షాలతో నెల రోజులుగా బొగ్గు ఉత్పత్తికి బ్రేక్!**

- హాల్ రోడ్లు దెబ్బతిని రవాణా వాహనాలు తిరగలేని పరిస్థితి
- క్వారీల్లో చేరిన కోట్ల కొద్దీ గ్యాలన్ల నీటిని తోడిపోస్తున్న అధికారులు
- సింగరేణి మణుగూరు ఏరియాలో లక్ష్య సాధనకు పాట్లు!


మణుగూరు ఏరియాలో ఓసీ–4లో నిలిచి ఉన్న వర్షపు నీరు

**మణుగూరు టౌన్:** ఎప్పుడూ లక్ష్యసాధనలో ముందుండే సింగరేణి మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తిలో వెనుకబడుతోంది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలతో ఓపెన్ కాస్టు గనుల్లో భారీగా వరద నీరు చేరింది. ఇప్పటివరకు నీటి తొలగింపు పూర్తికాకపోవడంతో బొగ్గు వెలికితీసే పరిస్థితి లేదు. సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో మణుగూరు ఏరియా అగ్రభాగాన ఉంటూ వస్తోంది. ఇక్కడ మణుగూరు(మల్లేపల్లి) ఓసీ, పీకే (ఓసీ–2, ఓసీ–4) ఓసీలతోపాటు కొండాపురం భూగర్భ గనులు ఉన్నాయి. వీటిల్లో కొండాపురం గనిలో ఉత్పత్తి లక్ష్యం స్వల్పంగా ఉండగా, మిగిలిన మూడు ఓసీల్లోనే అధిక మొత్తంలో బొగ్గు ఉత్పత్తి అవుతోంది.

**ఓసీల్లో భారీగా చేరిన వరద నీరు**

మణుగూరు ఏరియాలో ఆగస్టు నెలలో భారీగా వర్షాలు కురిశాయి. దీంతో ఓసీ క్వారీల్లో నీరు రెండు నెలలుగా ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడింది. అధికారులు నిరంతరం శ్రమిస్తూ ఉత్పత్తి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తున్నారు. ఏకధాటిగా, భారీగా కురిసిన వర్షాలతో చేరిన నీటిని ఇంకా తోడిపోస్తూనే ఉన్నారు. 2023లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 2090 మి.మీ వర్షపాతం నమోదు కాగా, 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 2,498 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. గతేడాది కంటే 498 మి.మీ వర్షపాతం అధికంగా నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఆరు నెలల్లోనూ ఆగస్టు 31వ తేదీన కురిసిన వర్షమే తీవ్ర ప్రభావం చూపింది.

**పంపింగ్‌పైనే ప్రధాన దృష్టి..**

నాలుగు దశాబ్దాల్లో ఏనాడూ కురవని వర్షం గత ఆగస్టు 31న కురిసింది. అర్ధరాత్రి నాలుగు గంటలకు పైగా ఏకధాటిగా వాన పడగా, 310 మి.మీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో గనుల్లో 385.54 హెక్టార్ల ప్రదేశంపై తీవ్ర ప్రభావం చూపి గనుల్లోకి ప్రవేశించే వీలు లేకుండా తయారైంది. ఆ ఒక్కరోజు మణుగూరు ఓసీ, పీకే ఓసీ గనుల్లో 4,370 లక్షల గ్యాలెన్లు వర్షపు నీరు చేరినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీంతో అప్పటికే గనుల్లో నిలిచిన నీటితో కలిపి 3,009.9 మిలియన్ గ్యాలన్లకు చేరుకుంది. ఫలితంగా ఓసీల్లోని కోల్ బెంచ్‌లు మునిగిపోయాయి. దీంతో మణుగూరు ఓసీలో రోజుకు 13 పంపుల ద్వారా 90 లక్షల గ్యాలన్లు, ఓసీ–4లో ఆరు పంపుల ద్వారా రోజుకు 70 లక్షల గ్యాలన్ల నీటిని బయటికి తోడిపోస్తున్నారు. మరో నాలుగు పంపులు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఓసీ–2లో ప్రత్యేక సంప్ ఉండటంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

**రిజర్వ్ కోల్‌ను ఉత్పత్తిగా చూపుతున్నారా..?**

మణుగూరు ఓసీలో సెప్టెంబర్ నెలలో 1.80 లక్షల టన్నుల లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించగా, 69.3 వేల టన్నుల బొగ్గు వెలికితీసినట్లు అధికారులు చెబుతున్నారు. పీకే ఓసీలో గత నెల లక్ష్యం 6.80 లక్షల టన్నులు కాగా 4.70 లక్షల టన్నులు వెలికితీసినట్లు పేర్కొంటున్నారు. అయితే మణుగూరు ఓసీలో కోల్ బెంచ్‌లు ఇంకా నీటిలో మునిగి ఉన్నాయని, బొగ్గు ఉత్పత్తి సాగడంలేదని కార్మికులు పేర్కొంటున్నారు. ఓసీ–4లో స్వల్పంగా ఉత్పత్తి చేయగలుగుతున్నట్లు సమాచారం. ఓసీ–2లో సంప్ ఉండటంతో ఆటంకం తొలగింది. కాగా ఉత్పత్తి లేకపోయినా, అప్పటికే వెలికితీసి ఉంచిన(రిజర్వ్) బొగ్గును ఉత్పత్తి చేస్తున్నట్లు యాజమాన్యం గణాంకాల్లో చూపుతోందని సమాచారం.

**తేలని కోల్ బెంచ్‌లు!**

ఓసీల్లో నిరంతరం ఊరే నీటిని ఎత్తిపోస్తూ బొగ్గు వెలికితీస్తారు. కోల్ బెంచ్‌లు మునగకుండా చర్యలు చేపడతారు. అయితే భారీ వర్షానికి ఓసీల్లో కోల్ బెంచ్‌లో పూర్తిగా మునిగిపోయాయి. నెల గడిచినా మణుగూరు ఓసీలో బెంచ్‌లు తేలకపోవడంతో బొగ్గు ఉత్పత్తి సాగడంలేదు. దీంతో నిలిచిన నీటిని ఎత్తిపోస్తుండగా, బొగ్గు ఉత్పత్తి ఇంకా ప్రారంభం కానట్లు తెలుస్తోంది. వర్షంతో ఓసీల్లోని హాల్ రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. బొగ్గు రవాణా వాహనాలు తిరిగే పరిస్థితి లేదు. అధికారులు రోడ్లను చదును చేసే పనులు చేపడుతున్నారు.

**చర్యలు తీసుకుంటున్నాం**



రెండు నెలల నుంచి మణుగూరు గనులపై వర్షం ప్రభావం చూపుతోంది. ఎప్పటికప్పుడు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు నిరంతరంగా కృషి చేస్తున్నాం. ఆగస్టు నెల చివరి వారంలో కురిసిన భారీ వర్షం మణుగూరు ఓసీ, ఓసీ–4 గనుల్లోని కోల్ బెంచ్‌లు మునిగిపోయాయి. హాల్ రోడ్లు దెబ్బతిన్నాయి. నీటిని పంపింగ్ చేస్తూనే బొగ్గు వెలికితీస్తున్నాం.

–దుర్గం రాంచందర్, సింగరేణి మణుగూరు ఏరియా జీఎం

## 138 కేజీల గంజాయి స్వాధీనం

**నిందితుడి అరెస్ట్, కారు స్వాధీనం**


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తిరుపతి

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం మీదుగా ముంబైకి తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ తిరుపతి సోమవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న ఓ కారును ఆపే ప్రయత్నం చేయగా, ఆపకుండా వెళ్లిపోయారు. దీంతో బ్రిడ్జి సెంటర్‌లో ఉన్న చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చేపట్టారు. పాత మార్కెట్‌లోని పార్కింగ్ స్థలంలో కారు నిలిపి ఉంచగా, అధికారులు గుర్తించి ఎక్సైజ్ స్టేషన్‌కి తరలించారు. కారులో రూ.34.50 లక్షల విలువైన 138.70 కేజీల గంజాయి ఉండగా సీజ్ చేశారు. కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కాగా ముంబైలో ఉన్న యూసఫ్ సహీద్ ఖాన్ అనే వ్యక్తి ఆదేశాల మేరకు గంజాయి తీసుకెళ్తున్నట్లు మహమ్మద్ ఫరీక్ విచారణలో తెలిపాడు. సహీద్ ఖాన్‌పై ఇప్పటికే ఘట్‌కేసర్, కొత్తగూడెం త్రీ టౌన్‌లో ఐదు కేసులు ఉన్నాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సీఐ శ్రీనివాస్, సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకట్, హరీష్, హనుమంతరావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై కేసు నమోదు

**జూలూరుపాడు:** దాడి ఘటనలో ముగ్గురు వ్యక్తులపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం.. జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన పప్పుల రాణిపై అదే కాలనీకి చెందిన కాశిమల్ల ప్రసన్నకుమార్, అతని భార్య రమాదేవి, కుమారుడు రవిబాబులు ఆదివారం అకారణంగా దుర్భాషలాడారు. ఆమె ప్రశ్నించగా ప్రసన్నకుమార్ కొడవలితో దాడికి పాల్పడ్డాడు. దీంతో రాణి తలకు తీవ్ర గాయం కాగా, కుటుంబసభ్యులు కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్


రెవెన్యూ అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

**అశ్వారావుపేటరూరల్:** ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. మండలంలోని నారాయణపురం గ్రామంలోని వాగు నుంచి అశ్వారావుపేటకు మూడు ట్రాక్టర్లలో ఇసుక తీసుకెళ్తుండగా ఆర్ఐ కృష్ణ దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు ఆర్ఐ తెలిపారు.

## దంపతుల ఆత్మహత్యాయత్నం

**పరిస్థితి విషమం.. హైదరాబాద్ తరలింపు**


రత్నకుమార్, పార్వతి

**జూలూరుపాడు:** సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఓ వ్యక్తి మాయమాటలు చెప్పిన వ్యక్తి రూ.16 లక్షలు కాజేయడంతో మనస్తాపానికి గురైన భార్యాభర్తలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటన కొత్తగూడెంలో సోమవారం జరిగింది. జూలూరుపాడు మండలం సాయిరాంతండా చెందిన హలావత్ రత్నకుమార్, పార్వతి దంపతులు రెండేళ్లుగా కొత్తగూడెంలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. రత్నకుమార్ స్థానికంగా ఓ షాపింగ్‌మాల్‌లో పని చేస్తుండగా పార్వతి ఇంటి వద్దే ఉంటోంది. రత్నకుమార్ డిగ్రీ వరకు చదవగా, పార్వతి డిగ్రీతోపాటు బీఈడీ చేసింది. వీరికి 2016లో వివాహం కాగా, ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నారు. కాగా, అదే షాపింగ్ మాల్‌లో పని చేస్తున్న మరో వ్యక్తితో రత్నకుమార్‌కు పరిచయం ఏర్పడగా తన మిత్రుడి ద్వారా సింగరేణిలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ అతడిని పరిచయం చేశాడు. ఆ వ్యక్తి చెప్పిన మాయమాటలు నమ్మి రత్నకుమార్, పార్వతి దంపతులు రూ.16 లక్షలు ఇచ్చారు. ఆ తర్వాత అతడిని సంప్రదించే ప్రయత్నం చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. పరిచయం చేసిన మిత్రుడు సైతం కొన్ని రోజులుగా షాపింగ్‌మాల్‌కు రావడం లేదు. దీంతో తాము మోసపోయామనే మనస్తాపంతో రత్నకుమార్ కలుపుమందు తాగాడు. గమనించిన పార్వతి 'నీవు లేని జీవితం నాకొద్దంటూ' ఆమె కూడా అదే మందు తాగింది. ఈ విషయాన్ని పార్వతి తన సోదరుడు కల్యాణ్‌కు ఫోన్ చేసి చెప్పగా వెంటనే కుటుంబసభ్యులు వెళ్లి కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో ఖమ్మం తరలించి, అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకెళ్లారు. ఇద్దరి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబసభ్యులు తెలిపారు.

## 50 కేజీల గంజాయి సీజ్

**భద్రాచలంఅర్బన్:** పట్టణంలోని కూనవరం రోడ్డులో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు ఆటోలో తరలిస్తున్న 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల గమనించిన నిందితుడు ఆటో వదిలేసి పారిపోయాడు. పారిపోయిన వ్యక్తిని త్వరలోనే పట్టుకుని కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పీవీఎన్ రావు తెలిపారు.

## ముగిసిన అటవీశాఖ జోనల్ క్రీడలు

- ఓవరాల్ చాంపియన్‌గా 'ఖమ్మం'
- విజేతలకు బహుమతులు అందజేసిన సీసీఎఫ్


విజేతకు మెడల్ అందిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్


కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి కప్ అందుకుంటున్న కొత్తగూడెం జట్టు

**చుంచుపల్లి:** కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో రెండు రోజులుగా జరుగుతున్న అటవీ శాఖ జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలకు చెందిన అటవీ ఉద్యోగులు పాల్గొన్నారు. జోనల్ క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా ఖమ్మం జట్టు నిలిచింది. అథ్లెటిక్స్, వాలీబాల్, క్రికెట్, షటిల్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించగా.. ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన ఖమ్మం టీంకు సీసీఎఫ్ డి.భీమానాయక్ ట్రోఫీ అందజేశారు. అలాగే, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, సిబ్బందిని సత్కరించారు. ఈ సందరభంగా సీసీఎఫ్ మాట్లాడుతూ.. పోటీ ప్రపంచం, యాంత్రిక జీవనంలో క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్ జిల్లాల అటవీ అధికారులు కిష్టాగౌడ్, సిద్ధార్థ విక్రమ్ సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అనూజ్ అగర్వాల్, డీసీఎఫ్‌లు పి.కృష్ణమాచార్య, కె.దామోదర్‌రెడ్డి, ఏసీఎఫ్‌లు ఎస్.సుజాత, సయ్యద్ మక్సూద్, బి.బాబు, వి.చంద్రశేఖర్, వి.మంజుల, యూ.కోటేశ్వరరావు, సందీప్‌రెడ్డి, భాగ్యానాయక్, మూర్తి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## విలేకరిపై కేసు నమోదు

**పాల్వంచ:** డబ్బులు ఇవ్వాలని లారీ ఓనర్‌ను బెదిరించిన ఓ పత్రికా విలేకరిపై సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, రూ. 50 వేలు ఇవ్వాలని పాల్వంచకు చెందిన లారీ యజమాని షేక్ బాదుల్లాపై ఓ విలేకరి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బాదుల్లా ఫిర్యాదు మేరకు సదరు రిపోర్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

## ల్యాబ్ టెక్నీషియన్ తొలగింపు

**పెనుబల్లి:** పెనుబల్లి ఏరియా ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ ప్రతిభను విధుల నుండి తొలగిస్తూ డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతనెల 27న ఆస్పత్రిని అదనపు కలెక్టర్ శ్రీజ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇన్ పేషంట్లకు రక్తపరీక్ష చేయాల్సి వస్తే ప్రైవేట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారని పలువురు ఆమెకు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టరేట్ సూచనతో విచారణ చేపట్టిన డీసీహెచ్ఎస్.. ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలకు సిఫారసు చేశారు. ఈమేరకు ఆమె తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ప్రతిభకు పెనుబల్లి ఆస్పత్రి ప్రధాన వైద్యులు కిరణ్‌కుమార్ ఉత్తర్వులు అందించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

**కూసుమంచి:** పాలేరు గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని(50) వ్యక్తి మృతి చెందాడు. స్థానిక చెక్‌పోస్ట్ సమీపాన నడిచి వెళ్తున్న వ్యక్తిని తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## క్లుప్తంగా

### జోనల్ క్రీడలకు 110 మంది ఎంపిక

**ముగిసిన డివిజన్‌స్థాయి క్రీడా ఎంపికలు**


లాంగ్‌జంప్ చేస్తున్న విద్యార్థి

**పాల్వంచరూరల్:** మండల పరిధిలోని కిన్నెరసానిలో ఉన్న గిరిజన స్పోర్ట్స్ స్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న డివిజన్‌స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, క్యారమ్స్, చదరంగం, టెన్నికాయిట్ తదితర పోటీల్లో ప్రతిభ చూపిన 110 మంది విద్యార్థులను జోనల్‌స్థాయికి ఎంపిక చేసినట్లు ఏఎస్ఓ వెంకటనారాయణ తెలిపారు. ఈ ఎంపికల్లో హెచ్ఎం ఎల్.రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, కె.నర్సయ్య, బి.సైదులు, జి.రమేష్, గోపాల్‌రావు, జి.రవి, డి.అంజయ్య, రాంబాబు, సావిత్రి, బి.నాగమణి, సుందర్‌లాల్, వాసు, జి.ప్రసాద్, సందీప్ మండల్ పాల్గొన్నారు.

### అధికారులను ఆశ్రయించిన 'మహిళా కోష్' బాధితులు


డీఆర్‌డీఓ విద్యాచందనకు వినతిపత్రం అందిస్తున్న బాధిత మహిళలు

**చంద్రుగొండ :** రాష్ట్రీయ మహిళా కోష్ రుణాల బాధితులు సోమవారం జిల్లా అధికారులను ఆశ్రయించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్పీ రోహిత్‌రాజు, డీఆర్‌డీఏ విద్యాచందనలను మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు తంబళ్ల సీతమ్మ, కోశాధికారి కాంతకుమారి కలిసి వినతిపత్రం అందించారు. 2006 ఏడాది తాము పదవుల్లో ఉన్నప్పుడు ఢిల్లీకి చెందిన సంస్థ రాష్ట్రీయ మహిళాకోష్ రుణాలు రూ. 50 లక్షలు ఇచ్చారని వివరించారు. 2011 వరకు చెల్లింపులు జరిగాయని, అనంతరం పదవీకాలం ముగియడంతో తాము తప్పుకున్నట్లు బాధిత మహిళలు తెలిపారు. కాగా వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ. 47 లక్షలు చెల్లించాలని ఢిల్లీ కోర్టు నుంచి ఇటీవల తమకు సమన్లు పంపారని పేర్కొన్నారు. విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

### పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు


పీఆర్‌టీయూ జిల్లా నూతన కార్యవర్గం

**కొత్తగూడెంఅర్బన్:** కొత్తగూడెంలో జరిగిన పీఆర్‌టీయూ యూనియన్ జిల్లా నాలుగో కౌన్సిల్ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడి డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు బద్రీనాథ్, సతీష్‌రెడ్డి సమక్షంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా జహంగీర్ షరీఫ్, నరసయ్య, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా దుర్గాభవాని, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్, సైదులు, శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా కళావతి ఎన్నికయ్యారు.

### నేడు ధ్రువపత్రాల పరిశీలన

**ఖమ్మం సహకారనగర్:** టీజీ డీఈఈసీఈటీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్టు)లో అర్హత సాధించిన అభ్యర్థులకు రెండో విడతగా మంగళవారం సర్టిఫికెట్లు పరిశీలన చేయనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో పాటు బోనఫైడ్, తాజాగా తీసుకున్న కులధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

### మొరాయించిన పోలీస్ వాహనం


వాహనాన్ని ముందుకు తోస్తున్న పోలీసులు

**కరకగూడెం:** పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం కరకగూడెం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభించి తిరిగివెళ్తున్నారు. ఈ క్రమంలో దారికి అడ్డంగా ఉన్న పోలీస్ వాహనం తీసేందుకు సిబ్బంది ప్రయత్నించగా స్టార్ట్ కాకుండా మొరాయించింది. కానిస్టేబుళ్లు కొంతదూరం నెట్టాక స్టార్టయింది.

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.14,392 |

## క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న అధికారులు

**కొత్తగూడెంఅర్బన్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ సూచనల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో సోమవారం నిర్వహించిన రోల్ ప్లే పోటీల్లో కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి విద్యార్థినులు మొదటి బహుమతి గెలుచుకున్నారు. ఆరోగ్యవంతమైన పెరుగుదల, పౌష్టికాహారం, ఇంటర్నెట్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం, వ్యసనాలకు బానిస కాకుండా ఉండటం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ద్వితీయ బహుమతి టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతిని సులానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా నాగరాజశేఖర్ మాట్లాడుతూ ప్రథమ బహుమతిగా రూ.1500, ద్వితీయ బహుమతిగా రూ.1000, తృతీయ బహుమతిగా రూ.750 అందించినట్లు తెలిపారు. ప్రథమస్థాయిలో నిలిచిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని పేర్కొన్నారు.

## సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినుల ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్ తదితరులు

**సింగరేణి(కొత్తగూడెం):** గత నెల 19,20 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ గ్రౌండ్‌లో నిర్వహించిన సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్‌లో సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. వారిని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ జీఎం కార్యాలయంలో సోమవారం అభినందించారు. పుస్తకాలు, ట్రాక్ షూస్ పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో సత్తా చూపాలని సూచించారు. తొలుత కళాశాల పీడీ సావిత్రి సెక్రటరీకి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఏ.వందన డిస్కస్‌త్రోలో మొదటిస్థానం, ఎం.సంగీత 300 మీటర్ల రేస్‌వాక్‌లో మొదటిస్థానం, ఎం.సింధు 400 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం సాధించారు. తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌లో ఎస్.ఇందు ప్రథమస్థానం సాధించింది. అథ్లెటిక్స్‌లో ద్వితీయస్థానంలో నిలిచింది. వీరు ఈ నెల 18,19,20 తేదీల్లో గుంటూరులో జరిగే నేషనల్ మీట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శారద పాల్గొన్నారు.

## జీఓ 25ను సవరించాలి


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి

**ఇల్లెందు:** జీఓ నంబర్ 25ను సవరించాలని జేఏసీకో చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన సింగరేణి హైస్కూల్‌లో జరిగిన టీఎస్ యూటీఎఫ్ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్ ఉండాలని, ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20గా నిర్ణయించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మీడియం వారీగా లెక్కించాలని, అదనపు ఉపాధ్యాయులను 1:30 నిష్పత్తిలో లెక్కించాలని 2021 ఆగస్టులో ఏకపక్షంగా ఇచ్చిన హేతుబద్ధీకరణ జీఓ 25 విడుదల చేశారని పేర్కొన్నారు. తీవ్ర వ్యతిరేకత రావటంతో అమలు నిలిపివేశారని, ఇప్పుడు అదే జీఓలోని నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయటం వల్ల పాఠశాలలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని తెలిపారు. జీఓ 25 లోని నిబంధనలు సవరించాలని కోరారు. ఈ సమావేశంలో టీఎస్ టీయూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజు, జిల్లా కార్యదర్శి పి. జయరాజు, మండల అధ్యక్షకార్యదర్శులు ఎ. రాంబాబు, లింగా నాయక్, కృష్ణవేణి, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

### 50 పోస్టులకు ఏడుగురే హాజరు

**ఖమ్మంవైద్యవిభాగం:** ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీనియర్ రెసిడెంట్(ఎస్ఆర్) పోస్టుల భర్తీకి సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. అయితే, కాంట్రాక్టు ప్రాతిపదికన 50 పోస్టులు భర్తీ చేయనుండగా కేవలం ఏడుగురే హాజరయ్యారు. కాగా, వచ్చిన వారంతా ఇంటర్వ్యూలో ఎంపికయ్యారని కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. మరోమారు నోటిఫికేషన్ ఇచ్చి మిగతా పోస్టులు భర్తీ చేస్తామని వెల్లడించారు. ఈ ఇంటర్వ్యూల్లో జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

### హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

**వైరా:** విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్‌ఎంపై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు విధించారు. వైరా మండలం పాలడుగు జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం చావా శ్రీనివాసరావు విద్యార్థినులతో అసభ్యకరంగాప్రవర్తిస్తుండడంతో రెండు రోజుల క్రితం తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. దీంతో ఆయనపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈమేరకు ఆయనను పోలీసులు మధిర కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. దీంతో శ్రీనివాసరావును సస్పెండ్ చేస్తూ వరంగల్ ఆర్జేడీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## బాలింత ఎలా చనిపోయింది?

**డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణ, వైద్యురాలికి నోటీసు**


విచారణ నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సీతారాం

**సత్తుపల్లి:** ప్రసవం కంటే ముందు ఆరోగ్య పరిస్థితి బాగున్నప్పుడు.. ఆపరేషన్ తర్వాత ఎందుకు విషమించింది.. బాలింత శ్రావణి ఎలా చనిపోయిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.సీతారాం ప్రశ్నించారు. సత్తుపల్లిలోని చందమామ ఆస్పత్రిలో చికిత్స చేయించిన దమ్మపేట మండలం నాచారానికి చెందిన బాలింత శ్రావణి శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం విదితమే. ఈమేరకు అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశాలతో సోమవారం ఆయన విచారణ చేపట్టారు. గర్భిణిగా ఉన్నప్పుడు చేసిన చికిత్స కేస్‌షీట్ పరిశీలించారా, సాధారణ ప్రసవానికి ప్రయత్నించినప్పుడు ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది.. ఆపరేషన్ తర్వాత ఖమ్మం ఎందుకు రిఫర్ చేశారని ప్రశ్నించారు. ఈమేరకు ఆస్పత్రి డాక్టర్ గుళ్లపల్లి రమ్య ఆపరేషన్ తర్వాత బాలింత శ్రావణికి బీపీ పెరగడం, ప్లేట్‌లేట్లు 60వేలకు పడిపోగా ఖమ్మం రిఫర్ చేశామని చెప్పారు. కాగా, ఆస్పత్రికి వచ్చిన పేషెంట్ చనిపోయే పరిస్థితికి చేరే వరకు ఏం చేశారు, వైద్యులుగా బాధ్యత లేదా అని ప్రశ్నించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ, పేషెంట్ చనిపోయాక మేనేజ్ చేసుకోవటం మంచిది కాదని పేర్కొన్నట్లు తెలిసింది. ఈమేరకు డాక్టర్ రమ్యకు షోకాజ్ నోటీసు ఇస్తున్నట్లు తెలిపారు. విచారణలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంట గంగారం, లంకాసాగర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆర్.అవినాష్, చింతా కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.




## ఒంటరి పెద్దలకు పెళ్లి.. మనమే చేద్దాం మళ్లీ..

▪ పంజగుట్టకు చెందిన సత్యనారాయణకు ముగ్గురు కూతుళ్లు. భార్య కేన్సర్‌తో చనిపోగా కూతుళ్లను పెంచి పెద్దచేసి పెళ్లిళ్లు చేశారు. కూతుళ్లు ఇంట్లో ఉన్నంతకాలం ఒంటరితనం అంటే ఏమిటో తెలియని ఆయన.. వారంతా అత్తారిళ్లకు వెళ్లిపోయాక కొన్ని నెలల్లోనే మానసికంగా కుంగిపోయారు. తండ్రి పరిస్థితి చూసి తల్లడిల్లిన కూతుళ్లు.. తండ్రికి తగ్గ జోడీని తెచ్చి పెళ్లి చేశారు. ఇప్పుడు సత్యనారాయణ భార్యతో కలిసి హాయిగా శేష జీవితం వెళ్లదీస్తున్నారు.

▪ అమెరికాలో నివసించే ఓ వివాహిత హైదరాబాద్‌లో ఉండే తన సోదరుడు చనిపోయాక ఒంటరిగా ఉండలేకపోతున్న తల్లి కష్టాలు చూసి చలించిపోయింది. వెంటనే నగరానికి వచ్చి దగ్గర బంధువులతో మాట్లాడటంతోపాటు ఎలాగోలా తల్లిని ఒప్పించి మరో పెళ్లి చేసింది. వారికి కావాల్సినవన్నీ సిద్ధం చేసి మళ్లీ అమెరికా వెళ్లిపోయింది.

ఈ రెండు ఉదంతాలు నవతరం పిల్లల ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయి. ఉమ్మడి కుటుంబాలను దెబ్బతీసిన న్యూక్లియర్ ఫ్యామిలీస్ ఆ తర్వాత సీనియర్ సిటిజన్స్‌కు వృద్ధాశ్రమాలనే మలి మజిలీలుగా మార్చాయి. అయితే ఇటీవల ఆ తరహా ఆలోచనల నుంచి ఇతరత్రా పరిష్కారాలను వెదుకుతున్నారు.. అందులో భాగంగానే పెద్దల పెళ్లిళ్లు ఊపందుకుంటున్నాయి. ఈ ట్రెండ్ అనేక మంది ఒంటరి తల్లులకు జంటను తెచ్చిపెడుతోంది. తండ్రికి మళ్లీ పెళ్లి చేయడం ద్వారా ఆయన బాగోగులు దగ్గరుండి చూసుకోలేకపోతున్నామనే గిల్టీనెస్ పోగొట్టుకోవడంతోపాటు మరో ఒంటరి మహిళకు తోడు అందించామనే తృప్తి కూడా పొందుతున్నామని సత్యనారాయణ కుమార్తెలు 'సాక్షి'కి చెప్పారు.



వృద్ధాప్యంలో శాపంగా మారే ఒంటరితనానికి పెళ్లి/లివిన్ మించిన పరిష్కారమార్గం లేదని అర్థం చేసుకొని 14 ఏళ్ల క్రితం మా సంస్థను ప్రారంభించాం. ఇప్పటివరకు మేము కొన్ని వేల మంది ఒంటరి వృద్ధుల జీవితాల్లో తిరిగి ఆనందాన్ని తీసుకురాగలిగామని గర్వంగా చెప్పగలను.

- రాజేశ్వరి, తోడు-నీడ సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ

# ఎలాంటి ఆధారాల్లేవ్



## చంద్రబాబు 'కొవ్వు' ప్రకటనపై సుప్రీంకోర్టు ఆగ్రహం

## లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు ఉందని సీఎం ఎలా చెబుతారు?

**సాక్షి, అమరావతి:** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో వినియోగించే నెయ్యిలో కల్తీ ఆరోపణల విషయంలో వాస్తవాలు నిర్ధారణ కాక ముందే కల్తీ జరిగినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రకటనలు చేయడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. లడ్డూ తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతు కొవ్వు ఉందని చెప్పేందుకు ముఖ్యమంత్రి వద్ద ఏం ఆధారాలున్నాయని సూటిగా ప్రశ్నించింది. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి ప్రెస్ ముందు అలా ఎలా మాట్లాడతారని నిలదీసింది. ప్రమాణాలకు అనుగుణంగా లేని నెయ్యిని వెనక్కి పంపించేశామని, అసలు ఆ నెయ్యిని లడ్డూ తయారీలో వాడనే లేదని టీటీడీ ఈవో చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేసింది. మరి అందుకు విరుద్ధంగా లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారని ముఖ్యమంత్రి రాజకీయ ప్రకటనలు ఎలా చేస్తారని విస్మయం వ్యక్తం చేసింది. అసలు దేని ఆధారంగా నెయ్యి కల్తీ అయినట్లు చెబుతున్నారు? లడ్డూలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఆధారాలు ఏమిటి? అని ప్రశ్నించింది. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనేందుకు ప్రాథమిక ఆధారాలు లేవని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒక వైపు దర్యాప్తు కొనసాగుతుండగా మరోవైపు రాజ్యాంగపరమైన ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులు రాజకీయ ప్రకటనలు చేయడం సరికాదని స్పష్టం చేసింది. అలాంటి ప్రకటనలు చేయడం వల్ల కోట్ల మంది ప్రజల మనోభావాలు ప్రభావితం అవుతాయని తేల్చి చెప్పింది. 'కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి..!' అని సీఎం చంద్రబాబు తదితరులను దృష్టిలో పెట్టుకుని ఘాటుగా వ్యాఖ్యానించింది. నెయ్యి కల్తీ జరిగిందంటూ రిపోర్టు ఇచ్చిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డే (ఎన్‌డీడీబీ) తన నివేదిక తప్పు కావొచ్చునని స్పష్టంగా పేర్కొందని ప్రస్తావించింది. నెయ్యి కల్తీ జరిగిందన్న విషయం ప్రజల్లోకి వెళ్లింది గానీ తన నివేదికలో తప్పులు ఉండవచ్చని ఎన్‌డీడీబీ స్వయంగా చెప్పిన విషయం మాత్రం ప్రజల్లోకి వెళ్లే పరిస్థితి లేదని వ్యాఖ్యానించింది. కల్తీపై ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికపై సెకండ్ ఒపీనియన్ (రెండో అభిప్రాయం) ఎందుకు తీసుకోలేదని టీటీడీని ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ ఒక్కటే అత్యున్నత ల్యాబ్ కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు ఎన్నో ఉన్నాయని టీటీడీకి గుర్తు చేసింది. ఎన్‌డీడీబీ నివేదికలో స్పష్టత లోపించిందని పేర్కొంది. నెయ్యి కల్తీ వ్యవహారంపై దర్యాప్తు జరగాల్సిందేనని సుప్రీంకోర్టు ప్రాథమికంగా అభిప్రాయపడింది. అయితే దర్యాప్తు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థ ద్వారా దర్యాప్తు చేయాలా? అనే విషయంపై తమకు సహకరించాలని సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై తదుపరి విచారణను అక్టోబర్ 3కి వాయిదా వేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నెయ్యి కల్తీకి సంబంధించి ప్రకటనలు చేసే విషయంలో నియంత్రణ పాటించేలా మీ క్లయింట్‌లకు (రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఈవో) చెప్పాలని టీటీడీ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకి ధర్మాసనం స్పష్టం చేసింది.

### మా ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పండి..

తమ ప్రశ్నలకు లూథ్రా సూటిగా సమాధానం చెప్పకుండా దాటవేస్తుండటంతో ధర్మాసనం జోక్యం చేసుకుంది. తమ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పాలని ఆదేశించింది. 'లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి ఉపయోగించారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. ముఖ్యమంత్రి ప్రకటనకు విరుద్ధంగా టీటీడీ ఈవో ప్రకటన ఉంది. కల్తీ నెయ్యి విషయంలో మీ (టీటీడీ) వైఖరి చాలా స్పష్టంగా ఉంది. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలకు ఎలాంటి ఆధారాల్లేవ్. దర్యాప్తునకు ఆదేశించినప్పుడు పదాల గారడీ ఎంత మాత్రం అవసరం లేదు...' అని ధర్మాసనం ఘాటుగా స్పష్టం చేసింది. సిట్ దర్యాప్తునకు ముందే ముఖ్యమంత్రి ప్రకటనలు చేశారని లూథ్రా తెలిపారు. సిట్ ఏర్పాటు తరువాత మాట్లాడలేదన్నారు. అసలు ఎంత మంది కాంట్రాక్టర్ల నుంచి నెయ్యిని సేకరిస్తున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. ఐదుగురు కాంట్రాక్టర్ల వద్ద నుంచని లూథ్రా పేర్కొనడంతో.. వారి నుంచి సేకరించిన నెయ్యి మొత్తాన్ని కలిపేస్తారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కలిపేస్తామని లూథ్రా బదులివ్వడంతో మరి ఎవరు సరఫరా చేసిన నెయ్యి కల్తీ అయిందో ఎలా నిర్ధారిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. మొత్తం నెయ్యి నుంచి కల్తీ నెయ్యిని ఎలా వేరు చేస్తారని ప్రశ్నించింది. దీనికి లూథ్రా నేరుగా సమాధానం ఇవ్వకుండా.. గత 50 ఏళ్లుగా స్వామి ప్రసాదాల కోసం కర్ణాటక ప్రభుత్వానికి చెందిన నందిని నెయ్యిని ఉపయోగిస్తూ వచ్చామని, గత ప్రభుత్వ హయాంలోనే కాంట్రాక్టర్ మారారని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలోనే నెయ్యి నాణ్యతను పరిశీలించామన్నారు. దీంతో కల్తీ వ్యవహారం బయటపడిందన్నారు. అయితే ఎన్‌డీడీబీ నివేదికలో అది తప్పు అయ్యే అవకాశం కూడా ఉందని స్పష్టంగా పేర్కొన్నారని, అలాంటప్పుడు సెకండ్ ఒపీనియన్ ఎందుకు తీసుకోలేదని ధర్మాసనం ప్రశ్నించింది. ఎన్‌డీడీబీ చాలా పేరున్న ల్యాబ్ అని లూథ్రా చెప్పగా.. అది ఒక్కటే కాదని, దేశంలో పేరు మోసిన ల్యాబ్‌లు చాలానే ఉన్నాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో దానినే కొనసాగించాలా? లేక దర్యాప్తును స్వతంత్ర సంస్థకు అప్పగించాలా? అనే విషయంపై చెప్పాలని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ (ఎస్‌జీ) తుషార్ మెహతాను ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 3న మధ్యాహ్నం 3.30 గంటలకు చేపట్టనున్నట్లు ప్రకటించింది.

#### పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు...

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ తయారీకి ఉపయోగించే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలపై వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ సీనియర్ నేత, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ సుబ్రమణియన్ స్వామి ఇటీవల సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. అలాగే లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంలో దర్యాప్తు, స్వతంత్ర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తిని నియమించాలని అభ్యర్థిస్తూ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి కూడా పిల్ దాఖలు చేశారు. ఇదే అంశంపై ఇతర రాష్ట్రాలకు చెందిన సంపత్, శ్రీధర్, సురేష్ చవంకే వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు వ్యాజ్యాలపై జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మధ్యాహ్నం విచారణ జరిపింది. పిటిషనర్ సుబ్రమణియన్ స్వామి తరఫున సీనియర్ న్యాయవాది రాజశేఖర్‌రావు, సంపత్, శ్రీధర్ తరఫున రాఘవ్ అవస్థీ, సురేష్ చవంకే తరఫున సీనియర్ న్యాయవాది సోనియా మాథుర్, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు.

#### బాబు ప్రకటనతో నిష్పాక్షిక దర్యాప్తు సాధ్యమేనా?

ముందుగా రాజశేఖర్ రావు వాదనలు వినిపిస్తూ.. 'తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ జరిగిందని సీఎం చంద్రబాబు రాజకీయ ప్రకటన చేశారు. అయితే టీటీడీ ఈవో ఆ నెయ్యిని అసలు లడ్డూ తయారీలో ఉపయోగించలేదని పత్రికా ముఖంగా చెప్పారు. బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్న ముఖ్యమంత్రి లాంటి వ్యక్తులు ఎలాంటి ఆధారాలు లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకటనలు చేస్తే దాని పర్యవసానాలు దారుణంగా ఉంటాయి. అవి ప్రజల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. సీఎం ప్రకటనకు భిన్నంగా టీటీడీ ఈవో ప్రకటనలు ఉన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పర్యవేక్షణతో కూడిన విచారణ అవసరం. ముఖ్యమంత్రి ప్రకటన నేపథ్యంలో దర్యాప్తు నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు సాధ్యమేనా? ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ జోక్యాన్ని నిలువరించాలి. మా వ్యాజ్యంలో పలు కీలక ప్రశ్నలను వ్యక్తం చేశాం' అని నివేదించారు.

#### ఆ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదు...

అనంతరం ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ఈ వ్యాజ్యానికి విశ్వసనీయత లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని సమర్థించేందుకే ఆయన ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారన్నారు. స్వామి, వైవీ సుబ్బారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాల్లోని అంశాలు ఒకే రకంగా ఉన్నాయన్నారు. నెయ్యి సరఫరాదారులకు టీటీడీ షోకాజ్ నోటీసులు జారీ చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించి దర్యాప్తు చేస్తోందని తెలిపారు. అనంతరం టీటీడీ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ కల్తీ నెయ్యిని పరీక్షల నిమిత్తం ప్రఖ్యాత ఎన్‌డీడీబీ ల్యాబ్‌కు పంపామన్నారు. జూన్ నుంచి జూలై 4 వరకు సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లను ఎన్‌డీడీబీకి పంపలేదన్నారు. జూలై 6, జూలై 12న సరఫరా చేసిన నెయ్యి శాంపిళ్లనే ఎన్‌డీడీబీకి పంపామని లూథ్రా వెల్లడించారు.

#### నివేదిక జూలైలో వస్తే సీఎం సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడారు..?

ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ప్రశ్నల వర్షం కురిపించింది. ఎన్‌డీడీబీ నివేదిక జూలైలో వస్తే ముఖ్యమంత్రి సెప్టెంబర్‌లో ఎందుకు మాట్లాడినట్లని ప్రశ్నించింది. జూలైలో వచ్చిన నివేదికపై అప్పుడే ఎందుకు మాట్లాడలేదు? ఈ వ్యవహారంలో ప్రెస్ ముందుకెళ్లాల్సిన అవసరం ఏముంది? ముఖ్యమంత్రి స్వయంగా దర్యాప్తునకు ఆదేశించినప్పుడు మళ్లీ ప్రెస్ ముందుకు వెళ్లడం ఏమిటి? నెయ్యిలో జంతు కొవ్వు కలిపారంటూ ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. అసలు ఈ ప్రకటన చేయడానికి ఆయన వద్ద ఉన్న ఆధారాలు ఏమిటి? లడ్డూల తయారీలో ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని చెబుతున్నప్పుడు ఆ లడ్డూలను పరీక్షల నిమిత్తం ఎందుకు పంపలేదు? ప్రెస్ ముందుకు వెళ్లే ముందు లడ్డూలను పరీక్షించడం సరైనదని మీరు (సీఎం) భావించలేదా? జంతు కొవ్వు వాడారంటూ చేసిన ప్రకటన కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీస్తుందని తెలియదా? ప్రెస్ ముందుకెళ్లి ప్రకటనలు ఎందుకు చేయాలి? దేవుడిని రాజకీయాలకు దూరంగా ఉంచండి. లడ్డూల తయారీలో కల్తీ నెయ్యి వాడారనేందుకు ప్రస్తుతం ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవు. దర్యాప్తు జరుగుతుండగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్నవారు అలాంటి ప్రకటనలు చేయవచ్చా? దాని వల్ల సిట్ దర్యాప్తు ప్రభావితం కాదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది.

జిల్లా వార్తలు

# పదహారేళ్ల కల... నెరవేరిన వేళ

- ఆనందంలో 2008 డీఎస్సీ అభ్యర్థులు
- మొదలైన సర్టిఫికెట్ల పరిశీలన
- తొలిరోజు 85మంది హాజరు.. నేడు కూడా అవకాశం

**ఖమ్మం సహకారనగర్:** 2008 సంవత్సరంలో నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులను కాంట్రాక్ట్ విధానంలో విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. దీంతో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అయితే, అభ్యర్థుల్లో పలువురు ఇప్పటికే వివిధ ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. కాగా, నాటి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అభ్యర్థులకు సోమవారం ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. దీంతో పలువురు అభ్యర్థులు హాజరయ్యారు.

**నేడు డీఈఓ కార్యాలయంలో...**

పాత డీఈఓ కార్యాలయంలో సోమవారం జరిగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కాని అభ్యర్థులకు మరో అవకాశం కల్పించారు. కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని డీఈఓ వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఉద్యోగులకు సూచనలు ఇస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ

### 16ఏళ్లుగా ఎదురుచూపులు

నాటి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో పలువురు అభ్యర్థులు అర్హత సాధించారు. అయితే, నియామకాలు చేపట్టకపోవడంతో సుమారు 16 ఏళ్లుగా పోరాడుతూనే జీవనోపాధి కోసం వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఈనేపథ్యాన సోమవారం చేపట్టిన సర్టిఫికెట్ల పరిశీలనకు మైదాన ప్రాంతానికి చెందిన 128మందిలో 67మంది, ఏజెన్సీ ప్రాంతం నుంచి 215మంది అభ్యర్థులు 18మంది హాజరయ్యారు. ఈ ప్రక్రియను డీఈఓ సోమశేఖర శర్మ పర్యవేక్షించి ఉద్యోగులకు సూచనలు చేశారు.

### ప్రభుత్వానికి కృతజ్ఞతలు



మమ్ముల్ని విధుల్లోకి తీసుకునే నిర్ణయించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు. అయితే, మేం 16ఏళ్ల సర్వీస్ కోల్పోయాం. సర్వీస్ విషయమై సానుకూల నిర్ణయం తీసుకుని, రెగ్యులర్ ఉపాధ్యాయుల్లాగే సౌకర్యాలు కల్పించాలి. అంతేకాక మమ్ముల్ని రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం.

– రేగళ్ల శేషు, గార్ల ఒడ్డు, ఏన్కూర్, ఖమ్మం జిల్లా

### పిల్లలను తీర్చిదిద్దే అవకాశం



ఉపాధ్యాయ వృత్తి ద్వారా పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దే అవకాశం లభిస్తుంది. అందుకే 2008లో ఎంపికై ఉద్యోగం రాకున్నా ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా చేరాను. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో బోధనకు, విద్యార్థులను తీర్చిదిద్దే అవకాశం రావడాన్ని సంతోషిస్తున్నా.

– భాగ్యలక్ష్మి, సారపాక, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

### పట్టు వదల్లేదు



2008 డీఎస్సీలో ఎంపికై నా ఉద్యోగానికి ఆటంకాలు ఎదురయ్యాయి. దీంతో ప్రైవేట్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ కూడా రాశాను. ఇంతలోనే ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగానికి పిలుపు రావడం ఆనందంగా ఉంది.

– టి.సైమన్, విద్యానగర్‌కాలనీ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

### సంతోషంగా ఉంది



2008 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించగా ఉద్యోగం వస్తుందా, రాదా అనే ఆలోచన ఉండేది. ఈ క్రమంలోనే ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నా. ఇంతలోనే రాష్ట్ర ప్రభుత్వం మమ్ముల్ని కాంట్రాక్ట్ పద్ధతిపై విధుల్లోకి తీసుకుంటుండడం హర్షణీయం.

– బి.అనిత, బయ్యారం, మహబూబాబాద్ జిల్లా

## పెద్దమ్మతల్లి ఆలయంలో నేడు రుద్రహోమం

**పాల్వంచరూరల్:** పాల్వంచ మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ ఆవరణలో మంగళవారం రుద్రహోమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 63034 08458 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## 4న సీనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

**ఖమ్మంస్పోర్ట్స్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయి సీనియర్స్ పురుషులు, మహిళల హ్యాండ్‌బాల్ జట్లను ఈనెల 4న ఎంపిక చేయనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.రఘునందన్ తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఎంపిక పోటీలు జరుగుతాయని వెల్లడించారు. క్రీడాకారులు ఆధార్ కార్డుతో ఉదయం 10 గంటల కల్లా రిపోర్ట్ చేయాలని సూచించారు. ఇక్కడ ఎంపిక చేసే జట్లు 9వ తేదీ నుంచి రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఆయన వెల్లడించారు.

## మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

**భద్రాచలం:** గోదావరి వరదల సమయాన వేటకు వెళ్లే మత్స్యకారులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కమాండర్ ముఖేష్ కుమార్ సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో సోమవారం వివిధ ప్రాంతాల మత్స్యకారులు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ మత్స్యకారులు వేటకు వెళ్లినప్పుడు వరద వస్తే లైఫ్ జాకెట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలన్నారు. వాగులు పొంగినప్పుడు దాటొద్దని, తప్పనిసరైతే లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. ఆ తర్వాత గుండెపోటుకు గురైన వారికి సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. అనంతరం గోదావరి ఒడ్డున డెమో ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్ డీఎస్‌పీలు ఇమజ్, కోటేశ్వర రావు, మంగరాజు, నరేందర్ పాల్గొన్నారు.

# దర్బార్‌లో ఉద్యోగ దరఖాస్తులు ఇవ్వొద్దు

ఐటీడీఏ పీఓ రాహుల్

**భద్రాచలం:** గిరిజన దర్బార్‌లో ఉద్యోగాలకు సంబంధించిన దరఖాస్తులు ఇవ్వొద్దని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి యూనిట్ అధికారులకు అందజేశారు. వీటిని సత్వరమే పరిశీలించి అర్హతల మేరకు పరిష్కరించాలని తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఉద్యోగాలకు సంబంధించి నోటిఫికేషన్ల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని, దర్బార్‌లో కేవలం స్వయం ఉపాధి, ఇతరత్రా సమస్యలపై మాత్రమే విన్నవించాలని పేర్కొన్నారు. ఏపీవో(జనరల్) డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ నాగార్జునరావు, వివిధ విభాగాల అధికారులు తానాజీ, రవీంద్రనాథ్, ఆర్.శ్రీనివాస్, భాస్కర్, ఉదయ్‌కుమార్, నరేష్, రమణయ్య, ఆదినారాయణ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తుదారుల సమస్యలపై ఆరా తీస్తున్న పీఓ రాహుల్

# శరవేగంగా సాగర్ కాల్వ కట్టల నిర్మాణం



భారీ గండి పడిన ప్రాంతంలో నిర్మించిన కట్ట

- నీరు విడుదల చేస్తూనే పనులు చేపడుతున్న అధికారులు
- ఆయకట్టు పంటలకు ఇబ్బంది లేకుండా నిర్ణయం
- పంట సీజన్ పూర్తయ్యాక లైనింగ్, శాశ్వత పనులు

**కూసుమంచి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ కాలువలకు భారీ గండ్లు పడి తీవ్ర నష్టం వాటిల్లిన విషయం విదితమే. ఈమేరకు గండ్ల పూడ్చివేత పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన పనులు తుది దశకు చేరాయి. వరదలతో పాలేరులోని మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన ఔట్ ఫాల్ కాల్వకు 150 మీటర్ల మేర భారీ గండి ఏర్పడింది. దీంతో ఇక్కడి పొలాల్లోకి నీరు చేరి ఇసుక మేటలు వేసింది. ఈక్రమాన అధికారులు భారీ గండిని రేయింబవళ్లు శ్రమించి పూడ్చివేశారు. ఆరు మీటర్ల ఎత్తు, 150 మీటర్ల పొడవుతో ఏర్పడిన గండిని కంకర డస్ట్‌తో నింపిన బస్తాలు పేర్చి వంద లాది లారీల మట్టితో పూడ్చారు. ఆపై గతంలో మాదిరి కట్ట కూడా నిర్మించడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి.

**కాల్వ కట్టల పటిష్టతపై దృష్టి**

మినీ హైడల్ ప్రాజెక్టు వైపు ఔట్ ఫాల్ కాల్వ కట్టలు తెగి గండ్లు పడగా అక్కడ కూడా పూడ్చివేశారు. ఇటువైపు కాల్వ కట్ట బలహీన పడటంతో జాతీయ రహదారి బ్రిడ్జి వరకు పటిష్ట పరిచే పనులు కొనసాగిస్తున్నారు. ఇక మినీ హైడల్ ప్రాజెక్టు వద్ద తెగిన కాల్వ కట్టను కూడా చాలావరకు పూడ్చివేయగా ఇంకా కొంత పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో పాటు పాలేరు రిజర్వాయర్‌కు నీటిని సరఫరా చేసే ఇన్‌ఫ్లో కాల్వకు కూడా రంగుల బ్రిడ్జి వద్ద పడిన గండిని పూడ్చివేసే పనులు తుది దశకు చేరాయి. ఈ ప్రాంతంలో 45 మీటర్ల మేర కాల్వ కట్ట కొట్టుకుపోగా పునర్నిర్మిస్తున్నారు. రంగుల బ్రిడ్జి ప్రాంతంతో పాటు పాలేరు వద్ద కాల్వల గండ్లు పూడ్చివేత, పటిష్టతకు ప్రభుత్వం రూ.9 కోట్ల నిధులు కేటాయించింది.

### ఓ పక్క పనులు.. ఇంకో పక్క నీటి విడుదల

కాల్వలకు గండ్లు పడి నీటి సరఫరా నిలిచిపోయి పంటలు ఎండిపోయే స్థితికి చేరడంతో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనలతో అధికారులు పనులను శరవేగంగా చేపట్టారు. దీంతో సాగర్ నుండి పాలేరుకు అంతరాయం లేకుండా నీరు చేరుతుండగా, ఇటు పాలేరు నుండి జిల్లాలోని ఆయకట్టుకు సైతం సరఫరా చేస్తున్నారు. పాలేరు నుండి ఇప్పటి వరకు కాలువకు 3వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా సోమవారం 3,600 క్యూసెక్కులకు పెంచారు. ఈ కాల్వకు 5వేల క్యూసెక్కుల నీటిని సరఫరా చేసే సామర్థ్యం ఉండడంతో ఆ మేరకు కట్టలు సిద్ధం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం గండ్లు పూడ్చి రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు విడుదల చేస్తున్నప్పటికీ పంటల సీజన్ ముగిశాక కాల్వలకు లైనింగ్ చేపట్టి శాశ్వతంగా పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పాలేరు వద్ద కాల్వ కోతకు గురికాగా అక్కడ ప్రస్తుతానికి ప్రమాదం లేకపోవడంతో నీటి సరఫరా నిలిపివేశాక పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.



పాలేరు వద్ద కోతకు గురైన కాలువ



జాతీయ రహదారి సమీపంలో కాలువ కట్టల నిర్మాణం